క్లుప్తంగా

సింగరేణి సీఐగా తిరుపతిరెడ్డి



సీఐకి పుష్పగుచ్ఛం అందిస్తున్న కారేపల్లి ఎస్సై రామారావు

కారేపల్లి: సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బి.తిరుపతిరెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. సీఐల బదిలీల నేపథ్యంలో హైదరాబాద్‌లో సీఐగా విధులు నిర్వర్తిస్తున్న తిరుపతిరెడ్డిని సింగరేణి సీఐగా బదిలి చేశారు. ఇక్కడ పనిచేస్తున్న సీఐ నూనె వెంకటేశ్వర్లను వరంగల్‌లో రిజర్వుడ్‌గా ఉంచారు. ఈ సందర్భంగా నూతన సీఐను కారేపల్లి, కామేపల్లి ఎస్సైలు రామారావు, కిరణ్‌కుమార్‌లు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు.

బీమా చెక్కు అందజేత



బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

పెనుబల్లి: మండలంలోని ఉప్పలచెలక గ్రామానికి చెందిన సూరటి లక్ష్మణరావు గత జనవరి 18న రైలు కింద పడి మృతి చెందాడు. మృతుడికి బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం ఉండడంతో పార్టీ బీమా చెక్కును ఆయన కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మోహన్‌రావు, పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు అశోక్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోపాలమిత్రలను రెగ్యులర్ చేయాలి

కొణిజర్ల: గత 23 ఏళ్లుగా గ్రామాల్లో పశువైద్య సేవలు అందిస్తున్న గోపాల మిత్రలను రెగ్యులర్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని గోపాల మిత్రల సంఘం మండల అధ్యక్షుడు గడల రామారావు పాలక ప్రభుత్వాలను కోరారు. బుధవారం తుమ్మలపల్లిలో నిర్వహించిన ఆ సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గోపాల మిత్రలకు చాలీ చాలని జీతంతో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. పశు వైద్యులు లేకుండా పశువైద్య సేవలు నిర్వహిస్తున్న గోపాలమిత్రలను ప్రభుత్వం పట్టించుకోవాలన్నారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల గోపాలమిత్రలు పాల్గొన్నారు.

నిరుపేదలకు అన్నదానం

మధిర: మధిర పట్టణంలోని శ్రీ విఘ్నేశ్వర స్వామి ఆలయం వద్ద బుధవారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ అధ్యక్షుడు బాణాల శంకరాచారి ప్రారంభించారు. కొత్తూరు గురు వెంకటేశ్వర్లు, శ్రీదేవి కుమార్తె పరిణితి పుట్టినరోజు సందర్భంగా వారి ఆర్థిక సహకారంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. అన్ని దానాల కన్నా అన్నదానం మిన్న అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు హరి రవి శాస్త్రి, వలిశెట్టి శ్రీనివాసరావు, కోనా జగదీష్, నాగేశ్వరరావు, బాలు, గౌస్, కష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు పూజలు..



పూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే చంద్రావతి

వైరా: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి బుధవారం వైరా రిజర్వాయర్ వద్ద గంగమ్మకు పూజలు చేశారు. గత కొద్ది రోజులుగా విస్తారంగా వర్షాలు కురిసి వైరా రిజర్వాయర్ నిండి అలుగు పోస్తుండంతో ఆమె స్థానిక మహిళలతో కలిసి గంగమ్మకు పూజలు చేశారు. రిజర్వాయర్ పూర్తిగా నిండటంతో రైతులకు, ప్రజలకు సాగు నీరు. తాగునీటికి ఇబ్బందులు లేవన్నారు.

కనీస వేతనాలు ఇవ్వాలి



సోలార్ ప్లాంట్ ప్రధాన గేటు ముందు ఆందోళన చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

కారేపల్లి: మండలంలోని ఉసిరికాయలపల్లి రెవెన్యూ సింగరేణి సంస్థ సోలర్ ప్లాంట్ ప్రధాన గేటు ముందు కాంట్రాక్ట్ కార్మికులు బుధవారం ఆందోళన చేపట్టారు. కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ.. సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ కార్మికులు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సమ్మెకు ఉసిరికాయలపల్లి సర్పంచ్ బన్సిలాల్ పాల్గొని సంఘీభావం తెలిపారు. నాయకులు నబీ, కృష్ణ, యాకూబ్, షావలీ, రాజేష్, మూడ్ శంకర్, మూడ్ సంజయ్, శ్రీను పాల్గొన్నారు.

జోరు వాన..

గత ఐదురోజులుగా ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అన్ని మండలాలు తడిసి ముద్దయ్యాయి. ముసురుతో పాటుగా మధ్య మధ్యలో కురుస్తున్న మోస్తారు వర్షంతో రోడ్లు జలమయమయ్యాయి. పంట చేలల్లో భారీగా నీరు చేరడంతో పాటుగా చెరువులు, కుంటలు అలుగుపారాయి. వాగులు ఉధృతంగా ప్రవహించాయి. ఈ సందర్భంగా పలు బ్రిడ్జీలపై పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసి రాకపోకలను నిలిపివేశారు. దీంతో ప్రయాణికుల అనేక ఇబ్బందులు పడ్డారు. ఈ సందర్భంగా అధికారులు అవసరమైతేనే తప్ప అనవసరంగా బయటకు రావొద్దని సూచనలు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



పెనుబల్లి: చెరువును తలపిస్తున్న వీయంబంజర్ రింగ్ సెంటర్ రోడ్డు



ముదిగొండ: నీట మునిగిన గంధసిరి మున్నేరు సమీపంలోని శ్మశాన వాటిక



ఎర్రుపాలెం: ప్రవహిస్తున్న కట్లేరు



మధిర: అలుగుపోస్తున్న మధిర చెరువు



సత్తుపల్లిటౌన్: అలుగు పోస్తున్న తామరచెరువు



తల్లాడ: మిట్టపల్లి వద్ద వాగు ఉధృతికి నీట మునిగిన వరి పైరు



కారేపల్లి: అలుగు పోస్తున్న పెద్దచెరువు



బోనకల్: అలుగుపోస్తున్న కలకోట చెరువు



కొణిజర్లలో భారీ వర్షాలకు దెబ్బ తిన్న రోడ్డు



ఏన్కూరు: గుంతలమయంగా రోడ్డు



చింతకాని: నాగిలిగొండ వద్ద రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వైరానదిని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్, కమిషనర్

మధిర: గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మధిర మున్సిపల్ చైర్ పర్సన్ మొండితోక లత, మున్సిపల్ కమిషనర్ అంబటి రమాదేవి కోరారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వైరా నదిని బుధవారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అత్యవసర పనులు ఉంటేనే బయటకు రావాలని సూచించారు. వైరా నది వద్ద మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మున్సిపల్ సిబ్బంది రేయింబవళ్లు ప్రజలకు అందుబాటులో ఉండి ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చూసుకోవాలన్నారు. అదేవిధంగా మండలంలో ఉన్న చెరువులకు భారీగా వరద చేరుతుంది. జాలిముడి ప్రాజెక్టు పొంగి ప్రవహిస్తుంది. బుధవారం రాత్రికి మండలంలోని అనేక చెరువులు అలుగులు పోసే అవకాశం ఉంది.

సత్తుపల్లి: భారీ వర్షాలు కురుస్తున్నందున లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లాడారు. శిథిలావస్థలో ఇళ్లలో ఉండొద్దని, కరెంట్ స్తంభాలను తాకొద్దని, పిల్లలను చెరువుల దగ్గరకు పంపొద్దని ప్రజలకు సూచించారు.



లోతట్టు ప్రాంతాల్లో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ మహేష్

మరమ్మతులు చేయించాలి

వైరా రిజర్వాయర్ ప్రధానకాల్వలకు..

వైరా: వైరా రిజర్వాయర్ ఆయకట్టు ప్రధాన కాల్వ డంపింగ్ యార్డ్‌ను తలపిస్తుందని తక్షణమే ప్రత్యేక నిధులు కేటాయించి కాల్వలకు మరమ్మతులు చేయించాలని సీపీఎం రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఆ సంఘం నాయకులు వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్, జలవనరుల శాఖ డీఈ శ్రీనివాస్‌లకు వినతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, చిన సత్యనారాయణ, రామారావు, నాగేశ్వరరావు, వీరభద్రం, వెంకటేశ్వరరావు, కృష్ణ, రామయ్య, మురళి, సుధీర్ పాల్గొన్నారు.

ఊరచెరువుకు..

కల్లూరురూరల్: మండలంలోని ఊరు చెరువుకు ప్రమాదం పొంచి ఉంది. గత ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువుకట్ట కోతకు గురైంది. సమీప ప్రాంతాల నుంచి భారీస్థాయిలో వరద నీరు చెరువులోకి చేరుతుండటంతో గరిష్ట స్థాయిలో నీరు చేరింది. దీంతో చెరువుకట్ట కోతకు గురై బలహీనంగా ఉండటంతో కట్ట ఎప్పుడు తెగిపోతుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వెంటనే అధికారులు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కోతకు గురైన చెరువుకట్ట

కేజీబీవీలో విద్యుత్ కేబుల్ మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎర్రుపాలెం: మండలకేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో బుధవారం విద్యుత్ కేబుల్ పూర్తిగా దెబ్బతినడంతో విద్యుత్ లైన్‌మేన్ నారాయణరెడ్డి, జూనియర్ లైన్‌మేన్ వెంకటేశ్వర్లు మరమ్మతులు నిర్వహించారు. ఇటీవల పాఠశాల సందర్శనకు వచ్చిన జీసీడీఓ భూలక్ష్మికి సమస్యను పాఠశాల ఉపాధ్యాయులు వివరించగా ఆమె డీఈఓ సోమశేఖర్‌శర్మ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన డీఈఓ మరమ్మతులు చేయాలని ఎంఈఓను ఆదేశించగా అతను సర్పంచ్ అప్పారావుకు తెలిపారు. దీంతో విద్యుత్ సిబ్బంది మరమ్మతులు చేశారు. ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డుకు..

కల్లూరు రూరల్: మండలంలోని తూర్పులోకవరం గ్రామం వద్ద వాగు పక్కనే నిర్మించిన తాత్కాలిక రహదారి వరదలకు కొట్టుకుపోవటంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఏకదాటిగా కురుస్తున్న వర్షానికి రోడ్డు వరదకు పూర్తిస్థాయిలో కొట్టుకుపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఎంపీడీఓ రవికుమార్, ఎస్సై రఘు బుధవారం లోకవరం చేరుకొని రోడ్డుకు మరమ్మతు పనులు చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తడికమళ్ల సామేలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మొక్కలు నాటాలి

చింతకాని: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలని గ్రామ సర్పంచ్ నారపోగు కొండలరావు తెలిపారు. మండలంలోని సీతంపేట గ్రామంలో హరితహారంలో భాగంగా బుధవారం ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హరితహారం కార్యక్రమాన్ని ఒక సామాజిక కార్యక్రమంగా గుర్తించి విరివిగా మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను తప్పనిసరిగా సంరక్షించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ కృష్ణ, గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు అందిస్తున్న సర్పంచ్ కొండలరావు

1న వాహనాల వేలం

సత్తుపల్లి: సత్తుపల్లి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్రవాహనాలు, ఒక కారు, ఒక ఆటోలకు ఆగస్టు 1న ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేయబడుతుందని ఎక్సైజ్ సీఐ వి.రాజశేఖర్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

తెలంగాణ రక్షణ సమితి అధ్యక్షుడిగా విజయ్



వైరా: తెలంగాణ రక్షణ సమితి వైరా నియోజకవర్గ అధ్యక్షుడిగా వైరాకు చెందిన కొమ్ము విజయ్ నియమితులయ్యారు. ఈ మేరకు సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు నరాల సత్యనారాయణ బుధవారం నియామక ఉత్తర్వులను విజయ్‌కు అందించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ.. వైరా నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

28న మండల పరిషత్ సమావేశం

కారేపల్లి: భారీ వర్షాలతో మండలంలో నెలకొన్న పరిస్థితులు, సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మండల పరిషత్ సర్వసభ్య ప్రత్యేక సమావేశాన్ని ఈ నెల 28వ తేదీన కారేపల్లి మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరు కావాలని కోరారు. అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో హాజరుకావాలని ఆయన పేర్కొన్నారు.

రైతును రాజుగా చేయడమే కేసీఆర్ లక్ష్యం

వైరా: రైతును రాజుగా చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని వైరా ఎమ్మెల్యే లావుడ్యా రాములునాయక్ అన్నారు. వైరా రైతు వేదికలో బుధవారం వైరా రిజర్వాయర్‌కు సాగునీటి విడుదలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రతి ఏటా నీటి ఎద్దడి లేకుండా అటు రైతులకు సాగునీరు.. ఇటు ప్రజలకు తాగునీటిని అందజేస్తున్నామన్నారు. రెండు పంటలకు నీరందించిన ఘనత ఒక్క తెలంగాణ బీఆర్‌ఎస్ ప్రభుత్వానిదే అన్నారు. రైతులకు 24 గంటల ఉచిత కరెంట్ అందజేస్తున్నామన్నారు. రైతులు సాగునీటిని పొదుపుగా వాడుకుని మంచి పంటలు పండించాలన్నారు. అనంతరం రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం కేసీఆర్‌ను ముచ్చటగా 3వ సారి ముఖ్యమంత్రిని చేయాలన్నారు. కార్యక్రమంలో ఐబీ డీఈ శ్రీనివాస్, ఏఓ పవన్‌కుమార్, వైరా మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్లపాటి సీతారాములు, రైతుబంధు సమితి నాయకులు మచ్చా నరసింహారావు, కట్టా కృష్ణార్జునరావు, వివిధ పార్టీల నాయకులు బొంతు రాంబాబు, పారుపల్లి కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

మణిపూర్ ప్రభుత్వాన్ని భర్తరఫ్ చేయాలి



ఏన్కూరు: మాట్లాడుతున్న వీరభద్రం

ఏన్కూరు: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న దాడుల నేపథ్యంలో తక్షణమే రాష్ట్ర ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్య వీరభద్రం డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత 3 నెలలుగా ఆదివాసి గిరిజనులపై క్రూరంగా అక్కడి రాష్ట్ర ప్రభుత్వం బీజేపీ ఆర్‌ఎస్‌ఎస్ కనుసన్నల్లో మైత్రివర్గాన్ని కొమ్ముకాస్తు దుర్మార్గపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కేంద్రప్రభుత్వం శాంతిని నెలకొల్పడంలో పూర్తిగా విఫలమైందన్నారు. అదే విధంగా సత్తుపల్లిలోని స్థానిక అంబేద్కర్ విగ్రహం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి నాగేశ్వరరావు, బానోత్ బాలాజి, ఏర్పుల రాములు, ఇటికాల లెనిన్, షేక్ జానీ భూక్య లక్ష్మనాయక్, తమ్మినేని వెంకటయ్య, అలవాల కరుణాకర్, కొలికపోగు సర్వేశ్వరరావు, వినయ్, రవి, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసనలో అలవాల కరుణాకర్, సీఐటీయూ నాయకులు

ఎమ్మెల్యేపై విమర్శలు సరికాదు..

సత్తుపల్లిటౌన్/కల్లూరు: సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పై కొండూరు సుధాకర్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదని ఎంపీపీ పగుట్ల వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు అద్దంకి అనీల్, గుండ్ర రఘు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ప్రసాద్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు వెంకటరత్నం, కృష్ణ, ప్రసాద్, పుల్లారావులు అన్నారు. బుధవారం సత్తుపల్లి స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో, కల్లూరు మండలంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ ఎల్లలు.. ప్రజా సమస్యలు కూడా తెలియని వారు నేడు ఎమ్మెల్యేపై విమర్శలు చేస్తున్నారన్నారు. ఇకపై నోటిని అదుపులో పెట్టుకోవాలని.. లేకపోతే నియోజకవర్గంలోని దళితులు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. కొండూరు సుధాకర్ ప్రభుత్వ ఉద్యోగిగా ఉన్నప్పుడు గుర్తుకురాని సమస్యలు ఎన్నికల సమయంలో గుర్తుకొస్తున్నాయని.. ఆయన ఎంతమంది దళితులకు సహాయం చేశారో చెప్పాలన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు మంగమ్మ, విజయరావు, ఎంపీటీసీ నిర్మల, భారతి, ప్రకాష్, కోఆప్షన్ సభ్యుడు ప్రకాశరావు, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే రఫీ, సురేష్, ఆనందరావు, శ్రీను, నర్సింహారావు, ఎస్సీ సెల్ నాయకులు బొక్కా వెంకశ్వర్లు, శ్యామేలు, వెంకటేశ్వర్లు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సత్తుపల్లిటౌన్: సమావేశంలో పాల్గొన్న దళిత ప్రజాప్రతినిధులు

'ఈవీఎం'ల పనితీరుపై అవగాహన

సత్తుపల్లిటౌన్: సత్తుపల్లి మున్సిపాల్టీలో బుధవారం ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ (ఈవీఎం)ల పనితీరుపై రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ ఎస్‌కె.జాని మున్సిపల్ సిబ్బందికి అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, కమిషనర్ కె.సుజాత, సొసైటీ అధ్యక్షుడు కృష్ణయ్య, రెవెన్యూ, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.



ఈవీఎంల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ సుజాత

రాజకీయ పక్షాలతో సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్

కల్లూరురూరల్: ఎన్నిలకలకు సంబంధించి కల్లూరు మండలంలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై బుధవారం తహసీల్దార్ బాబ్జీ ప్రసాద్ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఎన్నికల సంఘం గుర్తించిన గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు గురించి రాజకీయపార్టీల నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. తూర్పులోకవరం గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అదే విధంగా పోచవరం గ్రామంలో పాత స్కూల్ బిల్డింగ్‌లో కాకుండా, నూతనంగా నిర్మించిన స్కూల్ భవనాల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ సమావేశంలో వివిధ పార్టీల నాయకులు కిరణ్ కుమార్, తన్నీరు కృష్ణార్జునరావు, కర్నాటి అప్పిరెడ్డి, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల రికార్డులు పరిశీలన



ఆర్డీఓకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ కృష్ణ

మధిర: ఖమ్మం ఆర్డీఓగా బాధ్యతలు చేపట్టిన స్వర్ణలత బుధవారం మొట్టమొదటిసారిగా మధిర తహసీల్‌ను సందర్శించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఆర్డీఓకి తహసీల్దార్ కృష్ణ, నాయబ్ తహసీల్దార్ రాజేష్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. అనంతరం మధిరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా ఉన్న ఆమె ఎన్నికలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సిబ్బందిని పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు.

పంచాయతీ కార్మికుల భిక్షాటన



హోటల్‌లో భిక్షాటన గావిస్తున్న కార్మికులు

ముదిగొండ: ముదిగొండలో గ్రామపంచాయతీ కార్మికులు భిక్షాటన కార్యక్రమం బుధవారం చేపట్టారు. ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న సమ్మె శిబిరం నుంచి ప్రధాన సెంటర్ వరకు గ్రామపంచాయతీ కార్మికులు ప్రదర్శన నిర్వహించి దుకాణాలు, హోటళ్లలో భిక్షాటన చేశారు.

సమస్యలను పరిష్కరించాలి..

తల్లాడ: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసఫ్ అన్నారు. తల్లాడలో బుధవారం జీపీ కార్మికుల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పంచాయతీ కార్మికులు గత 21 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సింగ్ నర్సింహారావు, జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రావ రామక్రిష్ణ, డి.చెన్నారావు, క్రిష్ణ, వెంకటేశ్వర్లు, రామక్రిష్ణ, శివ, ఎల్లారావు, నరసింహారావు, రవీంద్రబాబు, మల్లిక, విజయ, పిచ్చమ్మ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కల్లూరు: కల్లూరు పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మాతిపోగు రవికి రెండు కిడ్నీలు చెడిపోయాయి. దీంతో బుధవారం సీఐ హనూక్ బాధితుడికి రూ.5 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో ఎస్సై పి.రఘు, పీసీ పి.నరసింహారావు, కృష్ణ, యువకులు పాల్గొన్నారు.



రవికి నగదు అందజేస్తున్న సీఐ హనూక్